ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

సోమవారం 15 ఏప్రిల్ 2024

అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం - 8లో..

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి - 7లో..



మామిడి.. విషతుల్యం

- కార్బైడ్‌తో మగ్గుతున్న పండ్లు
- నిషేధించినా యథేచ్ఛగా వాడకం
- వ్యాధుల బారిన జనం - అధిక ఖర్చుతో ఇథలీన్‌కు దూరం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వేసవిలో అందరికి అందుబాటులో ఉండేవి.. చూడగానే నోరూరించేవి మామిడి పండ్లు. మెరుపు చూడగానే కొనేయాలనిపిస్తుంది. కానీ ఆరోగ్యానిచ్చే పండ్లు విషతుల్యం అవుతున్నాయి. కార్బైడ్ వినియోగంపై నిషేధం ఉన్నా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మామిడి పండ్లను మగ్గిస్తున్నారు. ఈ సారి కాస్తా ముందుగానే మామిడిపండ్లు మార్కెట్‌లోకి వచ్చాయి. ధరలు మాత్రం భగ్గుమంటున్నాయి. కిలో రూ.100 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. కార్బైడ్‌తో మగ్గిస్తున్న పండ్లను తింటే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పండ్లలోనే రారాజుగా పిలిచే మామిడి పండ్ల మెరుపు చూసి ఎక్కువ ధరకైనా కొనుగోలు చేస్తున్నారు. మామిడి తోటలు లీజుకు తీసుకున్న వ్యాపారులు వడగండ్ల వర్షాలను దృష్టిలో పెట్టుకొని అప్పుడే కోతలు మొదలు పెట్టారు. కార్బైడ్ రసాయనాలతో మాగబెడుతున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మార్కెట్‌లో మెరుస్తూ కనిపిస్తున్న పండ్లను చూసి సంబరపడుతున్నా రసాయనాలతో మగ్గించడంతో కొత్త రోగాలు తెచ్చుకుంటామనే భయం కూడా వెంటాడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మండీలను ఏర్పాటు చేసి కృత్రిమంగా కాల్షియం కార్బోనేట్‌తో మాగబెడుతూ జిల్లాలోని వివిధ మండలాలకు సరఫరాకు సిద్ధం చేశారు.

● వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి

తియ్యని పండ్ల వెనక విషతుల్యం దాగి ఉంది. వివిధ ప్రాంతాల నుంచి మామిడి కాయలను దిగుమతి చేసుకొని రసాయనాలతో మాగబెడుతున్నారు. జిల్లాలో ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మామిడి పండ్లే కాకుండా ఇతర పండ్లు కూడా కృత్రిమ పద్ధతుల్లోనే మాగబెట్టి విక్రయాలు చేపడుతున్నారు. సిరిసిల్లలోని చుట్టుపక్కల మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా మామిడి కాయలను తీసుకొచ్చి నిషేధిత కార్బైడ్ రసాయనాలను వాడుతూ పండ్లను మాగబెట్టడంతో ఇతర పండ్ల కంటే మిలమిల మెరుస్తూ కనిపిస్తున్నాయి. కార్బైడ్ ఇతర రసాయనాలతో మాగబెట్టిన పండ్లు తినడంతో అనేక రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అల్సర్, కాలేయం, క్యాన్సర్, గొంతునొప్పి, రక్తహీనత, కిడ్నీ, నరాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు గతంలోనే కార్బైడ్‌పై నిషేధించింది. కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

● పండ్ల తొక్కతీస్తే మంచిది

పండ్లను తినేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. శుభ్రంగా మంచినీటితో కడగాలి. ఉప్పుతో కలిపిన నీటితో కడగడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

● మాగబెట్టిన పండ్లను ఇలా గుర్తించండి

కాయలను కార్బైడ్ ద్వారా మాగబెట్టి, రంగు మార్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీటిని గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్లపై ఆకుపచ్చని మచ్చలు ఉంటాయి. పసుపు వర్ణం ఎక్కువగా ఉంటుంది. ఈ పండు తినే సమయంలో నోట్లో కొంచెం మంట కూడా ఉంటుంది. కడుపులో నొప్పి, గొంతు నొప్పి, డయేరియా ఉంటే కార్బైడ్ వాడినట్లుగా గుర్తించవచ్చు. సహజ సిద్ధంగా మాగితే ఆకుపచ్చ, పసుపు రంగులు కలిసినట్టుగా ఉంటుంది. పండును కోసినపుడు గుజ్జు ఎరుపు, పసుపు కలిసినట్టుగా ఉంటుంది. పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది. తొడిమ లోపటికి కుంగినట్లుగా ఉంటుంది.

● ఇథలీన్ గ్యాస్‌పై అవగాహన కరువు

కాల్షియం కార్బైడ్ రసాయనం వినియోగించడాన్ని 2012 మార్చిలోనే అప్పటి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధించింది. నిషేధం ఉన్నా వాడడం మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు కచ్చితంగా ఉన్న ఆహార కల్తీ నిరోధక శాఖలు మాత్రం పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నిషేధిత కార్బైడ్ సరఫరా జరుగుతున్నా రైతులకు అవగాహన కల్పించడంలేదు. కాల్షియం కార్బైడ్ బదులు ఇథిలీన్ గ్యాస్ ద్వారా పండ్లను మాగబెడితే ఆరోగ్య కరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. మాగబెట్టే గదులను ఉపయోగించాలని తెలిపింది. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం రైపనింగ్ చాంబర్‌ల ఏర్పాటు కోసం రాయితీ కూడా కల్పిస్తోంది. కానీ ఇథిలీన్ వాడకం రైపనింగ్ చాంబర్‌ల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. రైపనింగ్ చాంబర్ ద్వారా ఇథిలీన్ గ్యాస్‌ను వదిలి పండ్లను మూడు రోజులపాటు మాగబెడుతారు. దీంతో పండ్లు సహజ సిద్ధంగా మాగినట్లు ఉంటాయి. మంచి రంగుతోపాటు రుచి కూడా ఉంటుంది. కానీ ఇథిలీన్ గ్యాస్ ఉపయోగించడంతో ఖర్చు పెరుగుతుందని రైతులు ఉపయోగించడం లేదని తెలుస్తోంది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 14: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని షాపింగ్ మాల్‌లు, ఫంక్షన్ హాల్‌లు, సినిమా హాల్‌లు, ఆసుపత్రులు, స్కూల్స్, గోడౌన్, పరిశ్రమలు, ఆలయాల్లో మంటలు ఆర్పివేసే పరికరాల వినియోగంపై సిబ్బందికి వివరించాలని ఆదేశించారు. జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి వెంకన్న, సిరిసిల్ల, వేములవాడ ఫైర్ ఆఫీసర్లు నరసింహచారి, కమలాకర్ పాల్గొన్నారు.

వియత్నాంలో ఉగాది వేడుకలు



ఉగాది సంబరాల్లో తెలుగు కుటుంబాలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14 : వియత్నాంలోని హోచిమిన్ సిటీ షైహాస్ సైగాన్ హోటల్‌లో తెలుగు అసోసియేషన్ వియత్నాం(టీఏవీ)ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు ప్రజలు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు పాటలతో గాయకులు అనుదీప్, మేఘన, శాస్త్రీయ నృత్యాలతో శ్రీను, నవ్య, దివ్యకుమారి ఆకట్టుకున్నారు. టీఏవీ సభ్యులు వేముల దేవేందర్, బజారి శ్రీనివాస్, లోచెర్ల ప్రసాద్, పసుమర్తి జయకృష్ణ, సంతోష్‌కుమార్, శంకర్‌గౌడ్, నాగరాజుగౌడ్, పోకల బాలాజీ, మధుకర్‌రావు, శివ, కిషోర్, అనిల్, శ్రీనివాస్‌రావు, జూటూరి శ్రీనివాస్, బాల సుబ్రహ్మణ్యం, నరేష్, దివ్య, రాధిక, శ్రీలత, వందన, పూనమ్, ఇందు, శరణ్య సౌజన్య, అనిత పాల్గొన్నారు.

వైభవంగా ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శివపంచాయతన ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉత్సవాలను హాజరయ్యారు. అంతకు ముందు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, అంబేద్కర్ సంఘం సభ్యులు రాజు, రవీందర్, ప్రసాద్, మహేశ్, భాను, నర్సయ్య, శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, లింగాగౌడ్, దేవానందం, రాజునాయక్, రవి, బాల్‌రెడ్డి, కిషన్; రాములు, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం దీక్షకు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేపట్టిన నిరసన దీక్షకు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు ప్రత్యేక వాహనాల్లో కరీంనగర్‌కు బయలుదేరారు. నాయకులు గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 14 : యువత క్రీడల్లో రాణించాలని రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల సాగర్ అన్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిరలో యూనిటీ ఆఫ్ అడవిపదిర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయన్నారు.

టీ షర్ట్‌ల పంపిణీ..

మండలంలోని అడవిపదిరలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ క్రీడాకారులకు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ టీ షర్టులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సెస్ సిబ్బంది

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల మధ్యలో కొత్త స్తంభాన్ని సెస్ అధికారులు ఏర్పాటు చేశారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారడంతో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సెస్ చైర్మన్‌తో పాటు ఎండీ స్పందించారు. వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిశీలించిన అధికారులు వేలాడుతున్న విద్యుత్ తీగల మధ్యలో స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కాంగ్రెస్ నాయకుడు మంగ కిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 14 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, దశరథ ఆర్గానిక్ ఫార్మా నిర్వాహకులు మూగల ప్రభాకర్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో ఫార్మా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ప్రజాప్రతినిధులు బాలాజీ, ముచ్చర్ల తిరుపతి, పొన్నం తిరుపతి, ఆసరి దేవరాజు, పొన్నం రాజు తదితరులు ఉన్నారు.

జంక్షన్‌ల వద్ద కానరాని సూచిక బోర్డులు



సూచిక బోర్డులు లేని మరిమడ్ల, నిమ్మపల్లి, మట్టిమల్ల గ్రామాలను కలిపే జంక్షన్

కోనరావుపేట, ఏప్రిల్ 14: జంక్షన్‌లు, మూలమలుపులు వద్ద సూచిక, భద్రతా బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలంలోని మరిమడ్ల-సిరిసిల్ల డబుల్ రోడ్డు మార్గంతోపాటు ఇతర రోడ్డు మార్గాల్లోనూ బోర్డులు లేవు. కోనరావుపేట మండలం నిజామాబాద్ జిల్లాకు ఆనుకోని ఉంది. మండలంలోని మరిమడ్ల దాటితే నిజామాబాద్ జిల్లా సరిహద్దు మండలం సిరికొండ ప్రారంభం అవుతుంది. సిరిసిల్ల జిల్లాకు నిజామాబాద్ జిల్లా నుంచి వేములవాడ రాజన్న దర్శనానికి, సిరిసిల్ల నుంచి హైదరాబాద్ వెళ్లడానికి తక్కువ దూరం కావడంతో వాహన దారులు ఎక్కువగా ప్రయాణిస్తారు. వారికి జంక్షన్‌ల వద్ద ఏ ఊరు వెళ్తున్నది? ఎక్కడ మూల మలుపులు ఉన్నాయో? ఎక్కడ వంతెన ఉన్నదన్న? బోర్డులుగానీ, సూచిక బోర్డులుగానీ లేవు. దీంతో పాటు మండలంలో చాలా గ్రామాల శివారులో రోడ్డు మార్గంలో పేర్లతో బోర్డులు లేవు. కోనరావుపేట గ్రామం నుంచి ఎగ్లాస్‌పూర్ వెళ్లే మార్గంలో కంచర్ల మార్గం వస్తుంది. ధర్మారం నుంచి కనగర్తి, నాగారం గ్రామాలకు వెళ్లే మార్గం, నిజామాబాద్ నుంచి మామిడిపల్లి, కనగర్తి వెళ్లే మార్గం మర్తనపేట నుంచి నాగారాం వెళ్లే మార్గం, మరిమడ్ల నుంచి నిమ్మపల్లి, వట్టిమల్ల, గర్జనపల్లి, తాటిపల్లి, మానాల వెళ్లే మార్గం, బావుసాయిపేట గ్రామం నుంచి బండపల్లి, మామిడిపల్లి వెళ్లే మార్గం, కోనరావుపేట మర్రి జంక్షన్‌లో నిమ్మపల్లి, మండల కేంద్రానికి వెళ్లే మార్గాలతోపాటు ఇంకా మండలంలో తారు రోడ్డు మార్గంలో జంక్షన్‌లు, క్రాసింగ్‌ల వద్ద సూచిక, భద్రతా బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా కాలభైరవస్వామి ప్రాణప్రతిష్ఠ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14 : సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని హనుమాన్ ఆలయంలో కాలభైరవ ప్రాణ ప్రతిష్ఠతోపాటు ఆలయ కలశపూజలను ఆదివారం పూజారి రఘురామశర్మ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని భకాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కాలభైరవ స్వామి ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలతోపాటు ఆలయ గోపుర కలశపూజలు నిర్వహిస్తున్నారు. కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజపూర్ణ చందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, ఆలయ కమిటి అధ్యక్షుడు వడ్లకొండ అనందం, కార్యదర్శి కుడిక్యాల శంకర్, ఉపాధ్యక్షుడు కోడం అమర్‌నాథ్, సహాయ కార్యదర్శి పత్తిపాక వేణుగోపాల్, కోశాధికారి అంజనేయులు, యేముల నారాయణ, కోడం నారాయణ, విశ్వనాథం, ప్రసాద్, అంకారపు కృష్ణహరి, గుండ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామయ్య కల్యాణానికి సిరిసిల్ల చీర



విజయ్‌కుమార్ తయారు చేసిన పట్టుచీర

సిరిసిల్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణోత్సవ వేళ భద్రాచలంలో జరిగే వేడుకలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ బంగారు పట్టుచీర నేశాడు. 18 రోజులు శ్రమించి నేసిన ఈ పట్టుచీర త్రీడీ కలర్స్‌లో రంగులు మారడం విశేషం. భద్రాచలంలో జరిగే వేడుకల్లో ఈ చీరను అందించనున్నట్లు విజయ్ తెలిపారు. బంగారు వెండి, జరీ పోగులతో 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు, 600 గ్రాములు ఉండే విధంగా చీరను తయారు చేశారు. చీర కదిలిన కొద్దిమూడు రంగుల్లో చీర కనిపించడం అందరినీ ఆకట్టుకుంటోంది. నల్ల విజయ్ గతంలో అగ్గిపెట్టెలో అమిరే చీర, ఉంగరంలో దూరే చీరతో పాటు విభిన్నమైన వస్త్రాలను చేనేత మగ్గంపై నేసి అందరినీ అబ్బురపరిచాడు. ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి అవార్డులను అందుకున్నాడు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను సమర్పించారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, సంఘం అధ్యక్షుడు భూపతి, ఉపాధ్యక్షుడు రాజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ శిక్షణ శిబిరం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 రోజుల పాలిటెక్నిక్ శిక్షణ శిబిరాన్ని ఎంఈవో దూస రఘుపతి ఆదివారం ప్రారంభించారు. అదేవిధంగా హంస హోమియోపతి కాలేజీ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పోపా డాక్టర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నంచందర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉత్తమ ర్యాంక్‌లు సాధించాలని కోరారు. పోపా ప్రతినిధులు గాజుల ప్రతాప్, డాక్టర్లు పత్తిపాక రఘు, అరుణ, సాయికుమార్, రవళి, సతీష్, శివరామకృష్ణ, డాక్టర్ సుమంత్, మెడికల్ కాలేజీ డైరెక్టర్ ఏ ఉమేష్, అలువాల ఈశ్వర్, కోడం రాంప్రసాద్, వాసాల హరిప్రసాద్, నవీన్, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి







అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదనపు ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆర్డీవో రమేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, డీపీవో వీరబుచ్చయ్య, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ మొహినుద్దీన్, మున్సిపల్ కమిషనర్ లావాణ్య పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్ఐలు యాదగిరి, రమేశ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ: వేములవాడలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఇసుక తీసుకు వస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్ డ్రైవర్ జన అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టారీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధుడి అదృశ్యం

జమ్మికుంట, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన గాజుల పరుశురాములు (70) అనే వృద్ధుడు అదృశ్యం అయినట్లు ఆదివారం పోలీస్‌లు తెలిపారు. గత నెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి ఆచూకీ తెలియడం లేదని కుమారుడు మల్లయ్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

గతంలో కూడా ఇదే విధంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ నాలుగైదు రోజులకు తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కోనరావుపేట, ఏప్రిల్ 14: కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ముష్కం లక్ష్మీరాజం (60) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముష్కం లక్ష్మీరాజం అస్తమాతో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం అస్తమాకు సంబంధించిన ఆపరేషన్ చేయగా నాలుగు లక్షల వరకు ఖర్చయ్యింది. ఆరోగ్యం పూర్తిగా కుదుట పడలేదు. ఆసుపత్రి కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఆరోగ్యం సహకరించక మనోవేదన గురై ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి బావుసాయిపేట గ్రామ శివారులోని మర్రిచెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు వెంకటేశం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మీరాజం భార్య రామవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య


భూక్య పంతులి

వీర్నపల్లి, ఏప్రిల్ 14: కుటుంబ కలహాలతో ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామం లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య పంతులి (65) భర్త సీతారాం అప్పుల బాధతో ప్రతిరోజు తాగుతూ గొడవకు దిగేవాడు. శనివారం రాత్రి తన భర్త తాగి గొడవ పడడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకున్న పంతులిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త సీతా రాం, కుమారులు రాములు నాయక్, భీమా నాయక్ ఉన్నారు.

కళాశాలలో చోరీ

మల్యాల, ఏప్రిల్ 14: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొంగ తనం జరిగింది. కళాశాలలోని ప్రిన్సిపాల్ గది, ఎగ్జామినేషన్ గది తాళాలు పగులగొట్టి అందులోని మానిటర్, సీపీయూలోని హార్డ్‌డిస్క్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ నెల 11న కళాశాలకు తాళం వేయగా ఆదివారం అటెండర్ మునుగూరి రాకేష్ తాళాలు తీయడానికి రాగ దొంగ తనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 14: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, శ్రీ భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

నెమలి వాహనంపై స్వామివార్ల విహారం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామివారలు నెమలి వాహనంపై విహరించారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం

మంథని, ఏప్రిల్ 14: పట్టణ శివారులోని ఆర్టీసీ బస్సు డిపో చౌరస్తా సమీపంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నారు. రేషన్ షాపుల ద్వారా సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా డిపో సమీపంలో మంథనికి చెందిన పలువురు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంచుల్లో టీఎస్ 02 యూటీ 2032 అనే అశోక లేలాండ్ ఆటో ట్రాలీలో దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. రేషన్ డీలర్ల నుంచి సేకరించిన ఈ బియ్యాన్ని పార్వతి బ్యారేజీ మీదుగా జైపూర్, చెన్నూరు మండలాల నుంచి సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతానికి తరలించి అధిక ధరలకు కొందరు స్మగ్లర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యాన్ని కొంత మంది అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అంతర్గాం, ఏప్రిల్ 14: రామగుండం - పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గురుకుల పాఠశాల సమీపంలో ఎగువ వైపు పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని రైలు కింద పడి రామగుండం పట్టంలోని భీమయ్య కాలనీకి చెందిన దండుగుల అంజి(29) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అంజి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఏప్రిల్ 14: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆదివారం వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లింగయ్య (85) అనే వృద్ధుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 13: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీమారి దేవయ్య(55) ఆదివారం తాటి ముంజలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. దేవయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని మైసమ్మ చెరువు ప్రాంతంలోని తాటి ముంజలు కోసేందుకు వెళ్లాడు. తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

కాల్పుల కేసులో నిందితుడి అరెస్ట్

● తపంచా, ఆరు బుల్లెట్లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ


స్వాధీనపర్చుకున్న తపంచా, బుల్లెట్లు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 14: రెండు కుటుంబాల మధ్య భూతగాదాలు హత్యాయత్నానికి దారితీశాయి. తపంచాతో కాల్పులకు పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో ఆదివారం వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం అనుబంధ గ్రామం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన ముస్కు మల్లారెడ్డి కుటుంబానికి, ముస్కు రామయ్య కుటుంబానికి కొన్నేళ్లుగా పెద్దంపేట్ గ్రామశివారులోగల 5 ఎకరాల వ్యవసాయ భూమి గురించి వీరి మధ్య వివాదం నడుస్తోంది. దీనిపై మల్లారెడ్డి కుటుంబం 2017లో కోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో మల్లారెడ్డిపై కక్ష పెంచుకున్న రామయ్య భూమి దక్కించుకోవడానికి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. 2018లో కాల్వశ్రీరాంపూర్ మండలం కొదురుపాక వద్ద గల ఇటుక బట్టిలో రామయ్య పనిచేస్తున్న క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో తుపాకులు దొరుకుతాయని తెలుసుకున్న రామయ్య మూడుసార్లు యూపీకి వెళ్లి ప్రయత్నించినా లభించలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న రామయ్య ఆగ్రాకు వెళ్లి ముప్పై వేలకు గుర్తుతెలియని వ్యక్తి వద్ద తపంచా, ఆరు తూటాలు కొనుగోలు చేశాడు. మార్చి 29న ఉదయం మల్లారెడ్డి తన మొక్కజొన్న చేనులో నీరు పెడుతుండగా రామయ్య తపంచాతో కాల్పులు జరుపగా గురి తప్పింది. మల్లారెడ్డి కేకలు వేయడంతో రామయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనపై మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నింతుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రామయ్య భయపడి కరీంనగర్, మహారాష్ట్రలోని పలుచోట్ల బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాడు. ఈనెల 14 ఉదయం డబ్బుల కోసం ఊషన్నపల్లికి వచ్చిన రామయ్య తన మేనకోడలు సంగీత వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ రామయ్య అదుపులోకి తీసుకున్నాడు. తపంచా కోసం విచారించగా తన ఇంటి పక్క భూమిలో పాతిపెట్టినట్టు తెలిపాడు. తపంచా, తూటాలను స్వాధీనం చేసుకొని నిందితుడు రామయ్యను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ కేసును చేధించిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రాజేందర్, అశోక్‌తో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్ యాదవ్, పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు, కాల్వశ్రీరాంపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల దాడులు

- కిలోన్నర బంగారం, ఏడు లక్షల నగదు స్వాధీనం


సొమ్మును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 14 : మెట్‌పల్లి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్థుల ఇండ్లలో పోలీసులు ఆదివారం కూడా దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాన్ బ్రోకర్స్ పేరుతో బంగారాన్ని తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలతో వ్యాపారం చేస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని కటకం ప్రకాష్, కటకం రమేష్, కటకం శివ, కటకం కార్తీక్ ఇండ్లలో దాడులు నిర్వహించినట్లు ఆదివారం సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపారు. శనివారం మధ్యాహ్నం మొదలైన దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగించినట్లు వారు వివరించారు. వారి వద్ద నుంచి తాకట్టు పెట్టుకున్న సుమారు రూ. 90లక్షల విలువ గల కిలోన్నర బంగారం, రూ. 7లక్షల నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులకు చట్టపరమైన నిబంధనలకు లోబడి వ్యాపారాలను నిర్వహించాలన్నారు. కటకం బ్రదర్స్ గత సంవత్సరంలో అధిక వడ్డీలకు పాల్పడుతున్నరని ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. మళ్లీ కటకం బ్రదర్స్ 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎలాంటి అనుమతులు లేకుండా బంగారం తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలకు పాల్పడ్డారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ గోరుమంతుల సుధాకర్, అధికారులు, పోలీసి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏసీసీ, ఏప్రిల్ 14: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గాయాలపాలైన యువకుడు ఆదివారం మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు(34) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చి రాత్రి ముఖరాం చౌరస్తాలో స్నేహితున్ని కలుస్తానని చెప్పి బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కాజీపేట నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొని గాయా లపాలయ్యాడన్నారు. మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదివారం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలి స్తుండగా మధ్యాహ్నం మృతిచెందాడన్నారు. మృతునికి భార్య శ్రీలేఖ, కొడుకు, కూతురు ఉన్నారన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ఎస్‌ఐ సుధాకర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 14: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఓదెల, ఏప్రిల్ 14: మండలంలోని కొలనూర్‌కు చెందిన కొంగరి స్వప్న (29) చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పొత్కపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలనూర్ గ్రామానికి చెందిన కొంగరి స్వప్న గత కొంతకాలంగా అందంగా లేనని, పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనోవేదకు గురైంది. ఈ నెల 12వ తేదీన తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన కోట సత్యనారాయణ అనే వ్యక్తి గత కొంత కాలంగా కేరళ రాష్ట్రం నుంచి లాటరీ టికెట్లు తీసుకుని వచ్చి అమ్ముతుండగా ఆదివారం వన్‌టౌన్ ఎస్‌ఐ సుగుణాకర్ అరెస్టు చేశారు. కేరళలో రూ.5ల కమీషన్‌తో గోదావరిఖని పట్టణంలో ప్రజలకు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని, తెలంగాణ లాటరీ టికెట్లపై నిషేధం ఉన్నందున సత్యనారాయణను అరెస్టు చేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: మాదిగల ద్రోహి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాదిగలను అవమానించిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని, బీజేపీని గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎస్సీలకు ఎంపీ అభ్యర్థులుగా మూడు సీట్లు ఉంటే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ద్రోహం చేసిందన్నారు. దళితుల్లో 20 శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, ఊరుకొక్క కుటుంబం ఉండే బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చారన్నారు. దళితుల్లో 75 శాతం ఉండే మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐదు శాతం జనాభా ఉన్న రెడ్డి కులానికి రేవంత్‌రెడ్డి ఆరు సీట్లను కేటాయించుకున్నారన్నారు. మాదిగల మద్దతుతోనే ఈ స్థాయికి ఎదిగానంటూ అనేక వేదికలపైన చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఎన్నికల్లో అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలను గతంలో భూస్థాపితం చేశామని, అదే గతి రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలంతా ఏకం కావాలన్నారు. ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, కరీంనగర్ అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, సిరిసిల్ల కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, రాష్ట్ర నాయకులు ఆవు నూరి ప్రభాకర్, గుండా థామస్, గుంద్రెడ్డి రాజు, బొల్లారం చంద్రమౌళి, నేరెళ్ల శ్రీనివాస్, బేస్ కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని జక్కుల శ్రీనివాస్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.2వేల విలువైన మద్యం సీసాలను శనివారం రాత్రి స్వాధీనపర్చుకున్నామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శ్రీనివాస్ తన ఇంటిలో మద్యం సీసాలను నిల్వ చేశాడనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. మద్యం సీసాలను స్వాధీన పర్చుకుని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ వైన్స్‌లో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్‌కు చెందిన పోలు శ్రీకాంత్ అక్రమంగా బెల్ట్ షాపు నడుపుటకు రూ.13,090 విలువ గల మద్యాన్ని మొలంగూర్ వైన్స్‌లో కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెలుగు వెలుగు మహానంది పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 13: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్‌రెడ్డి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రహాసన్, తెలంగాణ సమాచార శాఖ సంయుక్త సంచాలకులు వెంకటరమణ, దైవాజ్ఞశర్మ ప్రదానం చేశారు. 48 సార్లు రక్తదానం చేసిన గిరిధర్‌రెడ్డి సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి పూర్ణచంద్రాచార్యులు, జాతీయ అధ్యక్షుడు రంగిశెట్టి రమేశ్, జాతీయ కన్వీనర్ వలబోజు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గం



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, ప్రశాంత్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిరిసిల్లలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మూడో మహాసభల ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ప్రకటించారు. అధ్యక్షుడిగా మంద అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా జాలపల్లి మనోజ్‌కుమార్, కుర్ర రాకేష్, సహాయ కార్యదర్శులుగా గుండెల్లి కళ్యాణ్‌కుమార్, అనూషతో పాటు 13 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆదిత్య, అభిలాష్, కిరణ్‌తేజ, సాయి, రాకేష్, సంతోష్, నేహ, నీతూష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14 : గత ప్రభుత్వంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందని, ప్రస్తుత ప్రభుత్వం తగిన సమయంలో స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(నూ) కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ప్రభుత్వాల ఆధిపత్యాల పోరులో నలిగిపోతున్న సిరిసిల్ల నేతన్నలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దశరథం మాట్లాడుతూ గత ప్రభుత్వ బకాయిలు రూ.270 కోట్లు విడుదల చేయవకపోవడం, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడంతో ఆసాములు, కార్మికులపై ప్రభావం పడిందన్నారు. సైజింగ్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి కూరపాటి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో భీమ్ దీక్ష ముగింపు సభ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14 : స్వేరోస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భీమ్ దీక్ష ముగింపు సభ నిర్వహించారు. ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ పాల్గొనల్సి ఉండగా అనివార్య కారణాలతో రాలేక పోవడంతో మరో అతిథి ప్రొఫెసర్ కాసిం హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ కాసిం స్వేరోస్ నాయకులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 18: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కందికట్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి కుంట శ్రీహరి, కోశాధికారిగా సామల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఉడత సంతోష్, సాంస్కృతిక కార్యదర్శిగా ఆడెపు అమర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఆదర్శ క్లబ్ సభ్యులు అభినందించారు.

కనగర్తిలో ఆటల పోటీలు

కోనరావుపేట, ఏప్రిల్ 14 : కోనరావుపేట మండలం కనగర్తిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుపాటి బాపురెడ్డి, బడే అంజి, అనుపాటి భూమిరెడ్డి, బెంద్రే శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సహాయం

రుద్రంగి, ఏప్రిల్ 14: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి ఇల్లా ప్రమీలా వివాహానికి పలువురు ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీ మంచే లావణ్య రాజేశం, రూ.5 వేలు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప మహేష్ రూ.6 వేల విలువైన క్వింటాల్ బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కంటె రెడ్డి, ద్యావల రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, ఏప్రిల్ 14 : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో అన్నాడి మల్లారెడ్డి అనే రైతు మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పన్నాల విజయ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, కిషన్ రెడ్డి, రాజు, శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

చందుర్తి : చందుర్తి మండలం రామరావుపల్లిలో గంగుల సత్తవ్వ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల హార్ట్ ఓపెన్ సర్జరీ అయిన ఎగోళం పర్శరాములను పరామర్శించారు.మండల కాంగ్రెస్ నాయకులు ముస్కు ముకుందరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గంగాధర, ఏప్రిల్ 14: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం గంగాధర మండలం మధురానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులు అలాట్ చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. బోనస్ దేవుడెరుగు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు మిల్లులు అలాట్ చేయలేదు, ఎందుకు తూకం వేయడంలేదని ప్రశ్నించా రు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులున్నారు.

అంబేద్కర్ జయంతిలో అధికార, విపక్ష నాయకులు



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే

గంగాధర, ఏప్రిల్ 14: గంగాధరలో అన్ని పార్టీల నేతలు, వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశా రు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఇద్దరు నాయకు లు కలిసి వేడుకలు జరుపుకోవడంతో అక్కడున్న కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒకే చోట ఇద్దరు నాయకులు కలువడంతో కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు.



వేములవాడలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు



సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో..

అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

సిరిసిల్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)/వేములవాడ: అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అలాంటి మహనీయుడి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ప్రపంచవ్యాప్తంగా కొలుచుకోవడం మనకు గర్వకారణం అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగిమహేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, గోలి మహేష్, వేములవాడ డివిజన్ ఆటో సంఘం అధ్యక్షులు దేవరాజు, నాయకులు రామతీర్థపు రాజు, కుమ్మరి శ్రీనివాస్, ముద్ర కోల వెంకటేశం, పోతు అనిల్, సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మైలారపు రాము తదితరులు ఉన్నారు.

వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం నేతృత్వంలో న్యాయవాదులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, ఉపాధ్యక్షులు ప్రతాప సంతోష్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పోత్తూరు అనిల్ కుమార్, పెంట రాజు, నక్క దివాకర్, కముటం అంజయ్య, గడ్డం సత్యనారాయణ రెడ్డి, బొడ్డు ప్రశాంత్ కుమార్, గొంటి శంకర్, పర్లపెల్లి అంజయ్య, గుజ్జె మనోహర్, సుంకపాక నవీన్ కుమార్, బొడ్డు గంగరాజు, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ, సుజాత, మమత తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న జిల్లా అధ్యక్షుడు వర్ధవెల్లి స్వామిగౌడ్ పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి చాకలి రమేష్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్, ఉపాధ్యక్షుడు రమేష్, నరేందర్, దేవరాజు, భాను, భాస్కర్, శ్రీనివాస్, అంజనేయులు, మేర్గు శ్రీనివాస్, సిద్ధు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా, పట్టణ కాంగ్రెస్ నాయకులు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, కార్యదర్శి కాసర్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి రియాజుద్దీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, చేనేత సెల్ పట్టణ అధ్యక్షుడు బాలరాజుయాదవ్, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్ నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలతో నివాలులర్పించారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణారాఘవరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, కౌన్సిలర్లు అన్నారపు శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, పాతూరి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ కౌన్సిలర్ పూర్ణచందర్, నాయకులు రాఘవరెడ్డి, యాదగిరి, మల్లారెడ్డి, భాస్కర్, మురళి, హరీష్, బాబీ, చాంద్‌పాషా పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. టీడీపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బింగి వెంకటేశం, టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి, నాయకులు పంజా బాలరాజు, ఆరె మల్లేశం, నవీన్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపెల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్‌లో అంబేద్కర్ విగ్రహాలతోపాటు చిత్రపటాల వద్ద అంబేద్కర్ సంఘాలు, యువజన సంఘాలతోపాటు ప్రజాప్రతినిధుల అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ జుపెల్లి శ్రీలతశ్రీనాథ్‌రావు, కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, పోచవేని సత్యఎల్లయ్యయాదవ్, పాతూరి రాజిరెడ్డి, బోల్గం నాగరాజుగౌడ్, కల్లూరి లత, బుర్రలక్ష్మీ, చెన్నమనేని కీర్తి, లింగంపల్లి సత్యనారాయణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గోల్లపల్లి బాలయ్యగౌడ్, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, షేక్ అలీ, మెదుదుల దేవయ్య, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, చెన్నమనేని కమాలాకర్‌రావు, బూర విష్ణువర్ధన్, ఎరవెల్లి శ్రీనివాస్‌రావు, గంద్ర రమేష్‌రావు, ఉలిసే తిరుపతి. పెద్దూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగకిరణ్, గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, గుగ్గిళ్ల తిరుపతి, సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, రాకం అనిల్, నీరటి శ్యాం, అదిపెల్లి నాగరాజు, అతికం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్ పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సిరిసిల్లలో అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా నాయకులు కోడం రమణ, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, మిట్టపల్లి రాజమల్లు, నక్క దేవదాస్, అన్నల్‌దాస్ గణేష్, గడ్డం శేఖర్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహంతోపాటు శివనగర్‌కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాకాల శంకర్‌గౌడ్, గుండమనేని మహేందర్‌రావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొంతుల శ్రీహరి, అవురం సుధాకర్‌రెడ్డి, బీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమ్మరి మల్లేశం, రాజలింగం, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, తాళ్లపల్లి శ్రీధర్, దుబ్బాక ప్రభాకర్, పోలుక ఆనంద్, ఐరెడ్డి సాంబారెడ్డి, మహేష్ జక్కని నవీన్, గోశిక మధు, భగవాన్, అయిల్నేని రాజేశ్వర్‌రావు, రాజేశం, సీహెచ్ రవీందర్, సురేందర్, గణేష్ పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: జిల్లా కోర్టు అవరణలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు డి.సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అంబేద్కర్ చిత్రపటానికిపూలమాలలు వేసి నివాలులు అర్పించారు.

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూర్‌లో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్యయాదవ్, పట్నం అశ్విని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో మహనీయుడి చిత్ర పటాన్ని వాహనంపై ఊరేగించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, తిరుపతిబాబు, బాబు, అపెరా సుల్తానా, పద్మ, మధు, మాజీ సర్పంచులు పాశం సరోజనదేవరెడ్డి, నర్సాగౌడ్, దేవానందం, శంకర్, బాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అంజవ్వనర్సయ్య, అమృత, రజితశ్రీనివాస్, వజ్రవ్వ, ప్యాక్స్ వైస్ చైర్మన్లు కృష్ణమూర్తి, సత్తయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సారంపెల్లిలో నాయకులు సిరిసిల్ల కిషన్ కొయ్యడ రమేష్, సిరిసిల్ల పరశురాములు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో ఎంపీపీ కార్యాలయంతోపాటు గ్రామ పంచాయితీల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, జిల్లా దిశా కమిటీ సభ్యులు బట్టు పీర్యా, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు , అంబేద్కర్ సంఘాల మండల అధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్, పార్టీ, ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులు అర్పించారు. జడ్పీటీసీ నాగం కుమార్,సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీవాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, పోంచెట్టి రాకేష్, చిలుక అంజిబాబు, దుమ్మ అంజయ్య పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండలంలో అంబేద్కర్‌కు నివాళి అర్పించారు ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం కోనరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నవీన్ అంబేద్కర్ చిత్రపాటం వద్ద నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు నివాళ్లు అర్పించారు. మానాలలో అంబేద్కర్ చిత్రపటానికి వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య నివాళి అర్పించారు. మాజీ సర్పంచులు తర్రె ప్రభలత మనోహర్, ఆల్లూరి మానస, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, భాదనవేణి రాజరాం పాల్గొన్నారు.



వేములవాడ పట్టణంలో..



పొత్తూర్‌లో పూలమాలలు వేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్



నివాళులు అర్పిస్తున్న సిరిసిల్ల న్యాయవాదులు



వేములవాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో.



నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో..



సిరిసిల్ల సర్దాపూర్‌లో..



సిరిసిల్ల పెద్దూర్‌లో..



గంభీరావుపేటలో..

పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 14 : భారత దేశ తొలి సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండలం కొళ్లమద్దిలో ఆదివారం గ్రామ ముదిరాజ్ యువజన సంఘం అధ్యక్షుడు చాత్రబోయిన రవి, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చాత్రబోయిన లక్ష్మణ్ అధ్యక్షతన మహాత్మా జ్యోతి బాపూలే, సావిత్రి బాయిపూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్శ హన్మండ్లు మాట్లాడుతూ జ్యోతిబాపూలేకు భారత్న రత్న ప్రదానం చేయాలన్నారు. ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో ప్రజా భవన్‌గా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విగ్రహ దాతలు పర్శ హన్మండ్లు, మాజీ సర్పంచ్ కేశవరావు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు దేవయ్య, పిట్ల బాబు, రాజు, శ్రీనివాస్, బాలరాజు, భూమేష్, రామచంద్ర, దేవేందర్, నర్సింలు, వెంకటస్వామి, అంజాగౌడ్, దేవరాజ్, రమేస్ తదితరులు ఉన్నారు.



పూలే విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైస్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

- 20 వేల టన్నుల ధాన్యం దగ్ధం

మేడిపల్లి/భీమారం, ఏప్రిల్ 14: మండలంలోని దేశాయిపేట గ్రా మంలో గల విఘ్నేశ్వర పారాబాయిల్ రైస్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమా దంలో 20 వేల టన్నుల వరకు ధా న్యం, 20 వేల వరకు ఖాళీ గోనె సంచులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 కోట్ల 40 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి నట్లు తెలిసింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటనా స్థలానికి సివిల్ సప్లై అధికారులు, పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలానికి చేరుకొని కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై శ్యాం రాజ్ తెలిపారు.